సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం ı 23 ı ఫిబ్రవరి ı 2024

I



కలుషిత ఆహారంతో కలకలం

కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం మహిళల వసతి గృహంలో కలుషిత ఆహారం తినడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. -IIలో



చెత్త రహిత నగరంగా కడప

కడపను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్‌బాబు పేర్కొన్నారు. -IIలో

గరిష్ఠం/కనిష్ఠం
37.3/22.5

వాతావరణం

జిల్లాలో గురువారం 22.5 - 37.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పంట సాగుపై సలహాలు

మైదుకూరు: మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏడో సాంకేతిక సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ రైతులకు ఉద్యాన పంటలు, పశుపోషణపై, పంటల సాగులో మెలకువలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మైఖేల్ రాజీవ్, కేవీకే అధిపతి శాస్త్రవేత్త బాలకృష్ణ, పలువురు ఉద్యాన, వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

24న కిసాన్‌మేళా

కడప అగ్రికల్చర్: కడపలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈనెల 24వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటలకు కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. ఒక్క రోజు కార్యక్రమానికి దక్షిణమండలి సహ సంచాలకులు డాక్టర్ రమణ, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి , కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కోర్డినేటర్ మురళీకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని వ్యవసాయంలో యాంత్రీకరణ, సుస్థిర వ్యవసాయానికి నేల,నీటి నాణ్యత గురించి వివరిస్తారన్నారు. కోళ్లను అంశించే బర్డ్ ఫ్లూ ఇతర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

కడప మహిళకు అవార్డు



అవార్డు అందుకున్న బత్తల స్రవంతి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరానికి చెందిన బత్తల స్రవంతికి వైద్య సేవలు అందిస్తున్న మహిళలకు ఇచ్చే అంతర్జాతీయ అవార్డును గురువారం దుబాయ్ నగరంలోని అబుదాబిలోగల మెడియార్ ఆస్పత్రిలో హెల్త్ 2.0 కాన్ఫరెన్స్‌లో అందజేశారు. అసాధారణ నాయకత్వంతో వైద్య సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డును అందజేస్తారు. బత్తల స్రవంతి కడపకు చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి కుమార్తె. ఈ సందర్భంగా పలువురు స్రవంతికి శుభాకాంక్షలు తెలియజేశారు.

25న 'మిస్టర్ ఆంధ్ర' బాడీబిల్డింగ్ పోటీలు



మాట్లాడుతున్న నూనె నగేష్, యూనుస్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరం వేదికగా 1వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్-2024 నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె నగేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. యూనుస్‌బాషా తెలిపారు. గురువారం కడపలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప నగరం రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ వేదికగా ఈనెల 25వ తేదీ సాయంత్రం పోటీలు జరగుతాయన్నారు. బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ది కడప బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జబర్దస్త్ నటులతో కామిడీ షో, మిమిక్రీ, డాన్స్ ప్రోగ్రాం, డైలాగ్స్ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ పోటీలకు ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సినీ నటులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మార్చి 10న మిస్టర్ రాయలసీమ..



మాట్లాడుతున్న న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ (నాబా) ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన కడప నగరంలో మిస్టర్ రాయలసీమ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నాబా రాష్ట్ర కార్యదర్శి న్యామతుల్లా, జిల్లా అధ్యక్షుడు తారిక్‌అలీ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని చాంపియన్స్ జిమ్ సెంటర్‌లో వారు మాట్లాడుతూ మిస్టర్ ఆంధ్రగా సుపరిచతుడైన షంషీరుద్దీన్ జ్ఞాపకార్థం ఈ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబా కోశాధికారి ఇంతియాజ్‌ఖాన్, వైఎస్ఆర్ కడప జిల్లా కార్యదర్శి అన్సర్‌అలీ, సభ్యులు ముక్తియార్, ఖాజాబాషా, అర్షద్, కరీముల్లా, నూర్‌బాషా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ ఆగేదే..లే

- అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో విద్యుత్ సంస్కరణలు
- వ్యవసాయం, గృహ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు
- కొత్తగా 9,317 కి.మీ 11 కేవీ లైన్లు
- పల్లెలకు 24 గంటలు త్రీఫేజ్ కరెంట్
- రూ.2,290 కోట్లతో చురుగ్గా సాగుతున్న పనులు



బి.మఠం మండలం చోదరాపల్లెలో ఏర్పాటుచేసిన 11 కేవీ విద్యుత్ లైన్

బి.కొత్తకోట: విద్యుత్ సరఫరా వ్యవస్థల్లో రెండు దశాబ్దాలుగా కనీస మార్పులకు గత ప్రభుత్వాలు ప్రయత్నించలేదు. అయితే ప్రస్తుత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్‌ఎస్) పథకం ద్వారా అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో విద్యుత్ సంస్కరణల పనులు వేగంగా మొదలయ్యాయి. ఇప్పటి వరకు వ్యవసాయానికి, గృహ అవసరాలకు ఇస్తున్న విద్యుత్ సరఫరా ఒకే విధానంలో ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో ప్రభుత్వం వ్యవసాయానికి, గృహాలకు ప్రత్యేక విద్యుత్ సరఫరా వ్యవస్థను విభజించి దేనికి అంతరాయం కలగకుండా, సరఫరా నాణ్యత పెంచేలా అభివృద్ధి పనులు చేపట్టింది. దీనికోసం రెండుజిల్లాల్లో రూ.2,290.22 కోట్లతో పనులు చేపట్టారు. ఇందులో అన్నమయ్య జిల్లాలో రూ.1,733.83 కోట్లు, వైఎస్సార్‌కడపజిల్లాలో రూ.556.41 కోట్లతో పనులు సాగుతున్నాయి.

- అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ప్రస్తుతం 6.3 కేవీ లైన్లుతో విద్యుత్ సరఫరా సాగుతోంది. దశాబ్దాలుగా ఈ లైన్లు ప్రజలకు సేవలు అందించాయి. అయితే కాలానుగుణంగా మార్పులు, అభివృద్ధి కోసం వీటి సామర్థ్యం పెంచాల్సి ఉంది. అందువల్ల వీటిస్థానంలో 11 కేవీ లైన్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం సాగుతున్న పనులు పూర్తయ్యాక 6.3 కేవీ లైన్ విద్యుత్ తీగలు ఇక్కపై కనిపించవు. 6.3 కేవీ లైన్ల స్థానంలో అన్నమయ్య జిల్లాలో 2,575.06 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్‌లైన్‌ను, వైఎస్సార్‌కడప జిల్లాలో 6.3 కేవీ లైన్ స్థానంలో 1,446.06 కిలోమీటర్ల కొత్త 11 కేవీ లైన్ ఏర్పాటు చేస్తారు. దీనివల్ల అన్ని రకాల విద్యుత్ సరఫరా వ్యవస్థలకు 11 కేవీ లైన్ వినియోగించుకుంటారు.

9,315 కిలోమీటర్ల 11 కేవీ లైన్లు

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో 6.3 కేవీ లైన్ స్థానంలో 11 కేవీ లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా 11 కేవీ విద్యుత్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ఉభయ జిల్లాల్లోని ఆయాప్రాంతాలను కలిపేలా కొత్తగా 9,317.12 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్ల పనులు చేపట్టారు. జిల్లా మొత్తాన్ని కలుపుతూ అన్ని ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా పనులు ఉంటాయి. ఈ లైను ఏర్పాటు విషయంలో ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొంది. పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితమైన పరిశ్రమలు భవిష్యత్‌లో పల్లెలకు విస్తరించనున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని 11కేవీ సామర్థ్యం కలిగిన లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. దీంతో ఎక్కడ పరిశ్రమలు వచ్చినా అక్కడ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం రాదు. పరిశ్రమ స్థాపకులకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు విద్యుత్ సరఫరా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు.

9,816 ట్రాన్స్‌ఫార్మర్లు

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో సేద్యానికి, గ్రామాలకు ఇస్తున్న విద్యుత్ సరఫరా కలిపి ఇస్తున్నారు.ఫలితంగా పల్లెలకు విద్యుత్ సరఫరాను మెరుగుపర్చడం, వ్యవసాయానికి ఇచ్చే సరఫరాలో అంతరాయం లేకుండా చేసేందుకు కొత్తగా 9,816 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. 160, 100, 63, 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 11 కేవీ కొత్త లైన్ల ఏర్పాటుతో వ్యవసాయానికి, పల్లెలకు ఇచ్చే సరఫరాను విభజిస్తారు. పల్లెలకు ప్రస్తుతం సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇస్తుండగా, ఈ పనులు పూర్తయ్యాక నిరంతరం 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుంది. ప్రత్యేక ఫీడర్లతో వ్యవసాయానికి పగటిపూటే విద్యుత్ సరఫరా ఇస్తారు. దీంతో ఎక్కడ సమస్య ఉంటే అక్కడేవరకే అంతరాయం ఉంటుంది. పల్లెలకు ఇచ్చే సరఫరాలో అంతరాయం ఉండబోదు.

వైఎస్సార్‌జిల్లాలో జరిగే పనులు

11 కేవీ విద్యుత్‌లైన్:	4,331.22 కి.మీ
6.3 కేవీ లైన్ 11 కేవీ లైన్‌గా మార్పు:	1,446.06 కి.మీ
160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు:	01
100 కేవీ :	895
63 కేవీ:	720
25 కేవీ:	2,044
11 కేవీ బేలు:	338
అండర్ గ్రౌడ్ కేబుల్:	7.6 కి.మీ
త్రీఫేజ్‌లో 5 వరసల విద్యుత్ వైర్లు:	807.62
సింగిల్‌ఫేజ్‌లో 3 వరసల విద్యుత్‌వైర్లు:	335.27
ఎల్‌టీ ఏబీసీ త్రీఫేజ్:	502.79
ఎల్‌టీ ఏబీసీ సింగల్‌ఫేజ్:	743.78

అన్నమయ్య జిల్లాలో..

11 కేవీ విద్యుత్‌లైన్:	4,985.9 కి.మీ
6.3 కేవీ లైన్ 11 కేవీ లైన్‌గా మార్పు:	2,575.06 కి.మీ
100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు:	1,535
63 కేవీ:	1,665
25 కేవీ:	2,956
11 కేవీ బేలు :	403
అండర్ గ్రౌడ్ కేబుల్:	4.04 కి.మీ
త్రీఫేజ్‌లో 5 వరసల విద్యుత్ వైర్లు:	2,351.85 కి.మీ
సింగిల్‌ఫేజ్‌లో 3 వరసల విద్యుత్‌వైర్లు:	697.84 కి.మీ
ఎల్‌టీ ఏబీసీ త్రీఫేజ్:	425.9 కి.మీ
ఎల్‌టీ ఏబీసీ సింగల్‌ఫేజ్:	445.14 కి.మీ

ప్రయోజనాలు

- పటిష్టమైన నిర్వహణ, పంపిణీ
- విద్యుత్ సరఫరాలో నష్టాలు అరిట్టడం
- పూర్తిగా లోఓల్టేజీ నివారణ
- రైతులు, ప్రజలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్
- సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాకు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఈఓపీఆర్‌డీలు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి గురువారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించిన ప్రగతి నివేదికలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ శాఖ ద్వారా పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన ప్రగతి నివేదికల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికలు మండల పరిషత్‌లు ఈనెల 29వ తేదీలోపు, జిల్లా స్థాయికి సంబంధించి వచ్చేనెల 31వ తేదీలోపు ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఖాదర్‌బాషా, కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నందలూరు(రాజంపేట): లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (అభ్యసనాభివృద్ధి కార్యక్రమం)లో భాగంగా విద్యాశాఖ రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు ఎం వసంత (సోషల్ పరిశీలకులు), ఈడీ మధుసూదన్ రెడ్డి (సైన్స్ పరిశీలకులు), రహంతుల్లా (ఇంగ్లీషు పరిశీలకులు) గురువారం నందలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వీరు 6,7,8వ తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా అంశాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు చేపట్టాల్సిన బోధన, కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. పలు సూచనలు ఇచ్చారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

- కంట్రోల్ రూమ్ నంబరు 08562-246344
- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈనెల 25న గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల సమాచార సౌలభ్యం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08562-246344 ను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఈ కంట్రోల్ రూమ్ కాల్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పైన పేర్కొన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేస్తే కంట్రోల్ రూమ్ స్టాఫ్ సహకరిస్తారన్నారు. పరీక్ష హాల్లో ఎటువంటి కాపీయింగ్ జరిగే అవకాశాలు ఉండవని, డిజిటల్ వస్తువులను అనుమతించే అవకాశం లేదన్నారు.

ఎన్నికలు సవ్యంగా జరగాలి

రానున్న అసెంబ్లీ, పార్లమెంటు సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు గురువారం కలెక్టరేట్‌లో 'ఎన్నికల వ్యయ యంత్రాంగం'పై డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జే.సురేష్ అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్న అధికారులు అదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల వ్యయ బృందంలోని వివిధ విభాగాల్లో విధులను నిర్వర్తించే వ్యయ పరిశీలకుడు, సహాయ వ్యయ పరిశీలకుడు, వీడియో సర్వైలెన్స్ టీమ్, వీడియో వీక్షణ బృందం, ఫిర్యాదుల మానిటరింగ్ కంట్రోల్ రూమ్ - కాల్ సెంటర్, మీడియా సర్టిఫికేషన్ - మానిటరింగ్ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్, ఎక్సైజ్ బృందాలు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు, ఎలక్టోరల్ రోల్ ప్రక్రియలు విధిగా అమలయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 'మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్' విధిగా పాటించాలన్నారు. రూట్ మ్యాప్, బ్యాలెట్ ముద్రణ, పోలింగ్ మెటీరియల్ సమకూర్చుకోవడం, మెటీరియల్ డిస్పాచ్ చేయడం, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, కౌంటింగ్ సమయంలో భద్రతా ఏర్పాట్లకు అవసరమైన చర్యలను పర్యవేక్షించడంతోపాటు సీజర్, సి-విజిల్ విధులను బాధ్యతగా చేపట్టాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆయన ఎన్నికల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు.

వాసుకు ఇంటిపోరు!

- తెలుగుదేశం పార్టీలో రివర్స్ గేర్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి
- ఆత్మీయులు, అనుచరులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు
- పొలిట్ బ్యూరో సభ్యుడుగా కట్టడి చేయలేని వైనం



శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: 'ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు'.. ఈ సామెత ఇప్పుడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డికి వర్తిస్తుంది. సొంత సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో రివర్స్ గేర్ అందుకున్నారు. కష్టపడ్డ తనను కాదని మరొకర్ని ప్రోత్సహిస్తారా.? టీడీపీలో తాను పల్లకి మోసే బోయిగా మిగిలిపోవాలా? ఇకపై తన సత్తా ఏమిటో చూపుతానని వ్యూహాత్మక హెచ్చరికలు చేస్తున్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పరిస్థితి చక్కబెట్టాల్సిన శ్రీనివాసులరెడ్డి ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని తెలుగుతమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. మా వ్యతిరేకుల్ని చేరదీస్తూ పార్టీలో వర్గాలను ప్రోత్సహించడం కాదు, చేతనైతే సొంత అన్న చేత టీడీపీ జెండా పట్టించాలని నియోజకవర్గ ఇన్‌చార్జిలు సవాల్ విసురుతున్నారు.

దివంగత మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి రాజకీయ వారసుడిగా రమేష్‌కుమార్‌రెడ్డి అరంగ్రేటం చేశారు. 1999లో లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో లక్కిరెడ్డిపల్లె రద్దు అయింది. రాయచోటి నియోజవకర్గంలో మూడు మండలాలు కలిసిపోయాయి. 2009 ఎన్నికల్లో టీడీపీ అవకాశం కల్పించలేదు. 2014, 19లలో రాయచోటి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. రమేష్‌కుమార్‌రెడ్డి 1999 నుంచి ఇప్పటి వరకు టీడీపీ నాయకుడిగా చలామణి అవుతున్నారు. కాంట్రాక్టర్‌గా స్థిరపడిన ఆయన సోదరుడు శ్రీనివాసులరెడ్డి 2014 వరకు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2014లో తొలిసారి కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి లక్షా తొంభైవేల పైచిలుకు ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు.

స్వలాభం కోసమే రాజకీయాల్లోకి....

సోదరుడు రాజకీయాల్లో ఉన్నా.. పదవీకాంక్ష శ్రీనివాసులరెడ్డిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేలా చేసిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కడప పార్లమెంట్‌కు పోటీ చేసి ఎన్నికల ఖర్చు భరిస్తే ఓడినా రాజ్యసభ సీటు ఇస్తామని టీడీపీ అధిష్టానం ఆఫర్ ఇచ్చిందని పలువురు చెప్పుకొస్తున్నారు. ఈమేరకు పార్టీలో దూకుడు పెంచినట్లు రెడ్డెప్పగారి కుటుంబ సన్నిహితులు వివరిస్తున్నారు. తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా టీడీపీ అవకాశం కల్పించింది. ఈక్రమంలో కడప అసెంబ్లీ ఇన్‌చార్జిగా తన సతీమణి మాధవీరెడ్డిని నియమించేలా చేసుకున్నారు. కడప పార్లమెంట్, అసెంబ్లీ టికెట్లను భార్యభర్తలు ఆశిస్తున్నారు. ఈక్రమంలో రాయచోటి ఇన్‌చార్జిగా ఉన్న రమేష్‌కుమార్‌రెడ్డి సీటు ప్రశ్నార్థకమైందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తాజా రాజకీయ పరిణామం రమేష్‌కుమార్‌రెడ్డి ఇజ్జత్‌కు సవాల్‌గా నిలుస్తోంది. 1999 నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ బాధ్యతగా పనిచేస్తున్న తనను కాదని, తమ్ముడి కుటుంబాన్ని ప్రోత్సహిస్తారా? అని టీడీపీ అధినేత పట్ల రగిలిపోతున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా టీడీపీ అభ్యర్థుల ఓటమికి పనిచేయాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే కడపలో కూడా శ్రీనివాసులరెడ్డికి వ్యతిరేకంగా ప్రచారంలో పాల్గొనాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వాసు శైలిని నిలదీస్తున్న ఇన్‌చార్జిలు

నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అండగా నిలవాల్సింది పోయి, వర్గాలను ప్రోత్సహించేలా శ్రీనివాసులరెడ్డి చర్యలు ఉన్నాయని ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు వాపోతున్నారు. కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డిని ప్రోత్సహిస్తూ ఇన్‌చార్జి పుత్తానరసింహారెడ్డికి ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన వర్గీయులు వాపోతున్నారు. ఇదే విషయమై పుత్తా నరసింహారెడ్డి హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే మైదుకూరు ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్‌తో నిమిత్తం లేకుండా ఆయన వ్యతిరేకుల్ని చేరదీస్తున్నట్లు తెలిసింది. ఇలాంటివి దృష్టిలో ఉంచుకొని ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు ముందు తన సోదరుడు రమేష్‌కుమార్‌రెడ్డిని నియంత్రించుకోవాలని శ్రీనివాసులరెడ్డికి సవాల్ విసురుతున్నారు. టీడీపీ జెండాలు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సోదరుడికి సర్దిచెప్పుకోలేని నాయ కుడు మాపై పెత్తనం చేయడం ఏమిటని నిలదీస్తున్నట్లు సమాచారం. పార్టీ శ్రేయస్సు కంటే స్వప్రయోజనాలు ఆశించడంతోనే ఇలాంటి వ్యవహారాలు తెరపైకి వస్తున్నట్లు విశ్లేషకులు చెప్పుకొస్తుండటం గమనార్హం.

ప్రమాదమెరుగని రథసారథులు

- ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీలో విధులు
- ఒక్క ప్రమాదం చేయని డ్రైవర్లను సన్మానించిన ఆర్టీసీ అధికారులు




ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం..సుఖవంతం అన్న నానుడిని కొందరు డ్రైవర్లు నిజం చేస్తున్నారు.ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారు. బస్సును ఎంత వేగంగా నడిపామన్నది కాకుండా క్షేమంగా ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నారు. ముఖ్యంగా ఒక్క ప్రమాదం చేయకుండా ఎన్నో ఏళ్లుగా డ్రైవింగ్ చేస్తూ.. అంకిత భావంతో పని చేస్తూ ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం గుర్తించి సన్మానిస్తే మిగిలిన వారు కూడా విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉంటారని భావిస్తున్నారు.



- కడప రీజియన్ వ్యాప్తంగా కడప, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల ఆరు డిపోలు ఉన్నాయి. వీరిలో ప్రమాదాలు చేయని డ్రైవర్లను ఆర్టీసీ అధికారులు గుర్తించి ఇతర ప్రభుత్వ అధికారులను పిలిపించి వారితో ఇటీవల సత్కరించారు. ఒక్కో డిపో నుంచి ముగ్గురు డ్రైవర్లు చొప్పున పిలిపించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

ప్రమాదాల డ్రైవర్లకు కౌన్సెలింగ్



బస్సులు నడుపుతూ ప్రమాదాలకు గురి చేస్తున్న డ్రైవర్లకు తరుచూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. కుటుంబ సభ్యులతో ఎలా ఉండాలి? విధి నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నాం. డ్రైవింగ్ మెలకువలతోపాటు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లతో తరచుగా శిక్షణ ఇస్తున్నాం.

- పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

జాగ్రత్తగా విధులు



నేను 29 సంవత్సరాలుగా జమ్మలమడుగు డిపోలో పనిచేస్తున్నాను. కుటుంబ సమస్యలు ఎన్ని ఉన్నా వాటిని ఇంటిలోనే వదిలేసి డ్రైవింగ్‌లో ఎదుటి వాహనాలు గమనిస్తూ.. ప్రమాదకర మలుపులు వచ్చినపుడు జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తున్నాను.

- ఎం.మనోహర్, డ్రైవర్, జమ్మలమడుగు

అప్రమత్తంగా ఉంటాను



నేను 29 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నా. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నచోట అప్రమత్తంగా ఉంటాను. ఆర్టీసీ అధికారులు సన్మానించడం సంతోషంగా ఉంది.

- ఎల్.శివారెడ్డి, మైదుకూరు డిపో

సన్మానంతో బాధ్యత పెరిగింది



నేను 30 సంవత్సరాలుగా ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రమాద రహిత డ్రైవరుగా సన్మానం పొందాను. దీంతో బాధ్యత మరింత పెరిగింది. రానున్న కాలంలో విధులను మరింత చిత్తశుద్ధితో, ఉన్నతాధికారుల మన్ననలు పొందేలా పని చేస్తాను.

- బీజే నాయక్, డ్రైవర్, కడప డిపో

దురలవాట్లు ఉండకూడదు



నేను 28 సంవత్సరాలుగా బద్వేలు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. డ్రైవర్ అనే వ్యక్తికి ఎలాంటి దురలవాట్లు ఉండరాదు. విధులకు అరగంటముందే వెళతాను. బస్సును శుభ్రం చేయించుకుని, తనిఖీ చేసిన తర్వాతనే రోడ్డుపైకి తీసుకు వస్తాను.

- బి.విజయభాస్కరరెడ్డి, బద్వేలు డిపో

అబ్జర్వర్ల నియామకం



నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, రాచమల్లు రవిశంకర్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్ల(పరిశీలకుల)ను వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ గురువారం ప్రకటించింది. బద్వేలుకు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, మైదుకూరుకు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడపకు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి, జమ్మలమడుగుకు సంబటూరు ప్రసాద్‌రెడ్డిలను నియమించారు.

ఉప సర్పంచ్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ జ్యోతికి అందజేస్తున్న నాగ ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని కోగటం గ్రామ ఉప సర్పంచ్ నాగ ప్రసాద్‌రెడ్డి ఎంపీడీఓ జ్యోతికి గురువారం వినతి పత్రం అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో పదవికి న్యాయం చేయలేకపోతున్నానని ఆయన పేర్కొన్నారు. అయితే పార్టీకి, వార్డు సభ్యుడిగా మాత్రం రాజీనామా చేయలేదన్నారు.

కలుషిత ఆహారంతో కలకలం



వైవీయూలోని మహిళల వసతి గృహం



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైవీయూ విద్యార్థినులు

- 23 మంది విద్యార్థినులకు అస్వస్థత
- పరామర్శించిన వీసీ, రిజిస్ట్రార్, డీఎంహెచ్‌ఓ



విద్యార్థినులను పరామర్శిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

వైవీయూ : కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం మహిళల వసతి గృహంలో కలుషిత ఆహారం తినడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల వివరాల మేరకు... బుధవారం రాత్రి వైవీయూలోని వసతి గృహంలో విద్యార్థినులు భోజనం చేశారు. కొద్దిసేపటి తర్వాత కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అంటూ అస్వస్థతకు గురవడంతో సమీపంలోని హెల్త్ సెంటర్‌కు వెళ్లారు. అక్కడ రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో సహాయకులు ప్రథమ చికిత్స చేసి వెంటనే విశ్వవిద్యాలయం అంబులెన్స్‌లో రాత్రి 10.30కు 11 మందిని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వెంటనే రిమ్స్‌కు చేరుకుని వైద్య అధికారులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. 11 మందికి చికిత్స చేసి డిశ్చార్జ్ చేయగానే, మరో 11 మంది అస్వస్థతకు గురికావడంతో గురువారం ఉదయం రిమ్స్‌లో చేర్పించారు. వీరిలో ఆరుగురికి నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. వైవీయూ వీసీ, రిజిస్ట్రార్లు పర్యవేక్షిస్తూ విద్యార్థినులను పరామర్శించారు. వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ఘటన వివరాలను కలెక్టర్, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. బయటి నుంచి గోబీ మాంచూరియా లాంటి జంక్ ఫుడ్‌ను తినడంతో ఇలా జరిగిందనే ఆరోపణలున్నాయన్నారు. ఆహారం, నీటిని టెస్టింగ్‌కు పంపామని, ఎక్కడ పొరపాటు జరిగిందో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

డీఎంహెచ్‌ఓ పరిశీలన

డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, బృందం చికిత్స తీసుకున్న విద్యార్థినులను పరిశీలించారు. వారు తీసుకున్న ఆహారం వివరాలు తెలుసుకున్నారు. ఆహారం కలుషితం కావడంతోనే విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, డయేరియా వచ్చాయని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. రిమ్స్ సూపరింటెండెంట్ డా.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి కొందరిని డిశ్చార్జ్ చేశామని, మరికొందరిని పరిశీలనలో ఉంచినట్లు తెలిపారు.

విద్యార్థుల ఆందోళన

వసతి గృహంలో ఆహారం తిని అస్వస్థతకు గురికావడాన్ని నిరసిస్తూ విద్యార్థులు వైవీయూ ముఖద్వారం వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వంట వండే సమయంలో పరిశుభ్రత పాటించడం లేదని, హెల్త్‌సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ వారికి నచ్చ చెబుతూ ప్రతిరోజూ ప్రిన్సిపల్, తాను పదిరోజులకోసారి వసతి గృహాలను తనిఖీ చేస్తున్నామన్నారు. సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అనంతరం వైస్ చాన్సలర్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎం.ఆర్. నాయక్ మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ఉయ్యాలవాడ’ పోరాటం స్ఫూర్తిదాయకం

- పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి
- ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పుస్తకావిష్కరణ



రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప సెవెన్‌రోడ్స్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం, పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు జీవీ.శ్రీనివాసులురెడ్డి అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177 వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయుడు ఫణి రచించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పుస్తకాన్ని ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు జరిపి ఉరి కంభాన్ని ముద్దాడిన స్వాతంత్ర్య సమరయోధుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. యూనివర్శిటీల్లో నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించిన నిజాలు వెలికితీసి విమర్శకులకు సమాధానం చెప్పాలన్నారు. రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు దారి తీసిన కీలక శ్రీభాగ్ ఒప్పందాన్ని చర్చకు రానీయకుండా తుడిచి వేయడానికి కొన్ని ప్రాంతాల నాయకులు ప్రయత్నాలు చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో కె.చిన్నపరెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, గాలి చంద్ర మాట్లాడుతూ నరసింహారెడ్డిని దోపిడీ దారుడంటూ కొందరు నిందలు మోపడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. నరసింహారెడ్డితోపాటు పలువురు పాలేగాళ్లు చెరువులు తవ్వించి, అడవులు నరికించి వ్యవసాయాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. అనంతరం ఉయ్యాలవాడ చరిత్రను పాఠ్యాంశాల్లో ఉంచేలా ఒత్తిడి తేవాలని సభికులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి రామకృష్ణారెడ్డి, వై.కేశవుల నాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కె.లింగమూర్తి, బలరామయ్య, చంద్రప్పనాయుడు, మంగమనాయుడు, శ్రీకృష్ణ, లెక్కల కొండారెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, కొండూరు జనార్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్.ఆయేషా, ఎస్.ఆక్సా, ఎస్.రోషిద, టి.ఆసిస్‌లకు వరుస బహుమతులను ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. నరసింహారెడ్డి గురించి విద్యార్థులకు ప్రసంగించడం సభికులను ఆకట్టుకుంది.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మేము కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. సొంతిల్లు లేక మా అమ్మగారి ఇంట్లో ఉంటున్నాం. చాలా సార్లు ఇంటి స్థలం కోసం గత ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకున్నా మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. వంతాటిపల్లి గ్రామంలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నా. సీఎం పుణ్యమా అని నా సొంతింటి కలనెరవేరింది.

– షేక్ జరీనా, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు



కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా గతంలో ధ్రువపత్రాలు అందేవి కావు. దానికి తోడు మండల కేంద్రానికి వెళ్లి వీఆర్వో, ఆర్ఐ, ఇతర అధికారుల సంతకాల కోసం ఎన్నో వ్యయ ప్రయాసాలు పడాల్సిందే. కానీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి వద్దనే ధ్రువపత్రాలు ఇచ్చారు. ఎలాంటి శ్రమకు నోచుకోకుండా వాలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చారు. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– గుడే. నాగేశ్వరి, ఆర్అండ్ఆర్ కాలనీ, చిన్నమండెం మండలం

చెత్త రహిత నగరంగా కడప


– ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబు



జీటీఎస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడపను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎస్‌బి అంజద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పుట్లంపల్లిలో చెత్తను ఎరువుగా మార్చే మైక్రో ప్రాసెసింగ్ సెంటర్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను గురువారం వారు ప్రారంభించారు. అనంతరం యూనిట్లను పరిశీలించి పనిచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కడప నగరాన్ని పరిశుభ్రంగా తయారు చేయడానికి ఐదు జోన్లుగా విభజించడం జరిగిందని, ప్రతి జోన్ కు ఒక సెంటర్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేసి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తీసుకొస్తాయన్నారు. మేయర్ మాట్లాడుతూ విభజించిన తడి చెత్తను మైక్రో ప్రాసెసింగ్ సెంటర్‌కు తీసుకొచ్చి ఒక మిషన్ ద్వారా ముక్కలు చేసి పెరుగు, బెల్లం, నీరు పోసిన గుంతల్లో మురగబెట్టడం జరిగిందన్నారు. 12 కోట్లతో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కడపను రూపుదిద్దేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, కె.వీరారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎ.బాలక్రిష్ణారెడ్డి, జమాల్‌వలి, కార్పొరేటర్లు కె.లక్ష్మిదేవి, పాకా సురేష్, షఫీ, మల్లికార్జున, ఆర్.చెన్నయ్య, రామలక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బు అడిగినందుకే రాజీనామా చేశాడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన డబ్బు కట్టమని అడిగినందుకే 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ అహ్మద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారని వార్డు ఇన్‌ఛార్జి చాంద్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ 78 మంది మహిళలు ఇళ్లు నిర్మించుకునేందుకు సుమారు రూ.25 లక్షలు మునీర్ అహ్మద్‌కు చెల్లించారన్నారు. తాము అభ్యంతరం వ్యక్తం చేసినా 20 రోజుల ముందు సౌదీ నుంచి వచ్చిన మునీర్‌ను కౌన్సిలర్‌గా నిలబెట్టి గెలిపించారన్నారు. ఇపుడు ఆయనను మహిళలు ప్రశ్నించడంతో రాజీనామా చేశారన్నారు. ఈ సమావేశంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యురేనియం ప్రాజెక్టులో ప్రమాదం

వేముల : తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో గురువారం ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టు వద్ద ఓ మిల్లులోని మిషన్‌కు బెల్టు ఊడిపోగా, దానిని సరిచేసే క్రమంలో హసన్ అనే కార్మికుడికి గాయాలయ్యాయి. అతడిని పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సేవే పరమావధిగా అడుగులు వేస్తా

- సీఎం చొరవతోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా
- సాక్షితో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



సామాన్యులకు విద్య, ఆరోగ్యం విషయంలో సేవలందించడమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అవకాశాన్ని అందిపుచ్చుకొని పనిచేస్తానని నందలూరు మండలం చెన్నయ్యగారిపల్లెకు చెందిన మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవమైన సందర్భంగా తొలిసారిగా ఆయన మనోగతం ఇలా పంచుకున్నారు... – రాజంపేట

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న : వైఎస్ కుటుంబంతో మీ అనుబంధం ఎలా ఏర్పడింది?

సమాధానం : మా నాన్న మేడా రామకృష్ణారెడ్డి ఆ రోజుల్లో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డితో కలిసి నడిచారు. బస్సుయాత్ర సందర్భంగా మా ఇంటికి వైఎస్సార్ వచ్చినపుడు ఆయనను చూశాను. అప్పటి నుంచి ఆ కుటుంబంపై అభిమానం పెంచుకున్నా. సీఎం నన్ను గుర్తించి రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం కల్పించారు. ఆయనకు రుణపడి ఉంటా.

ప్రశ్న : ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై మీ అభిప్రాయం?

సమాధానం : మేడా రఘునాథరెడ్డి అంటే ఒక పెద్ద నిర్మాణ సంస్థకు అధిపతిగా తెలుసు. నేను గతంలో పెద్దగా రాజకీయాల్లో కనిపించకపోవడం వాస్తవమే. మా కుటుంబంలో ఒకరు ఎమ్మెల్యేగా ఉంటే చాలనుకున్నా. మేడా మల్లికార్జునరెడ్డికి తోడుగా ఉంటూ అందరి సహకారంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నాం. ఈసారి సీఎం చొరవతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది.

ప్రశ్న : రాజ్యసభ సభ్యుడిగా జిల్లా అభివృద్ధికి ఏ విధంగా అడుగులు వేస్తారు?

సమాధానం : ఉభయ వైఎస్సార్ జిల్లాలో నందలూరు రైల్వే కేంద్రం పూర్వ వైభవం కోసం ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డితో కలిసి కృషి చేస్తాను. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో నందలూరు న్యూ రన్నింగ్ రూం మంజూరైంది. ప్రత్యామ్నాయ రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని రైల్వే మంత్రి ప్రకటించారు. రాజంపేట, నందలూరు, రైల్వే కోడూరు ,ఒంటిమిట్ట రైల్వే స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ కృషి చేస్తాను.

ప్రశ్న : సొంత మండలం నందలూరు అభివృద్ధిపై మీ ఆలోచనలు ఏమిటి?

సమాధానం : నందలూరు నాకు సొంత మండలం అయినందుకు గర్విస్తున్నాను. గతంలో బ్రిటీష్ వారు నీటి కోసం ఇక్కడ స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ పెట్టారు. నందలూరు వద్ద ముంబయి-చెన్నై మార్గంలో అన్ని రైళ్లకు నీటి సౌకర్యం ఉందని రైల్వే మంత్రిత్వ శాఖకు తెలియజేస్తా. క్రూసెంటర్‌ను బలోపేతం చేసి ప్యాసింజర్, గూడ్స్ రైళ్లకు క్రూ పెట్టేందుకు కృషి చేస్తా. దీంతో పాటు ఒంటిమిట్ట, నందలూరు, తదితర ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తా.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అరుణాచలగిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం తిరువణ్ణామలైకి వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా తిరువణ్ణామలైకి బస్సు బయలుదేరుతుందన్నారు. బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరో బస్సు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా బయలుదేరుతాయన్నారు. మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6 గంటలకు ఒక బస్సు బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు మైదుకూరు నుంచి కడప మీదుగా వెళ్తుందని తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి రాత్రి 8.30 గంటలకు ఓ బస్సు, జమ్మల మడుగు నుంచి మరో బస్సు రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు బయలుదేరుతాయన్నారు. పులివెందుల నుంచి ఉదయం 7 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి బస్సు వెళుతుందన్నారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళలకు కుట్టు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు దుస్తుల తయారీ, టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 10–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకుంటే ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించి శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్హతల ధ్రువపత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రాజంపేట రోడ్డులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 63028 33546, 94409 33028 నెంబరులో సంప్రదించాలన్నారు.

బ్యూటీ పార్లర్‌లోనూ..: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ మహిళలకు బ్యూటీ పార్లర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని నారాయణరెడ్డి తెలిపారు. 18–45 సంవత్సరాలలోపు వయస్సు కలిగి దరఖాస్తు చేసుకున్న వారికి 30 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా ఈశ్వర్‌రెడ్డి



వైవీయూ : తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీఓఎస్) ఛైర్మన్‌గా యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎస్.ఈశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఈ స్థానంలో ఉన్న కొలకలూరి మధుజ్యోతి ద్రావిడ వర్సిటీ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈశ్వర్‌రెడ్డిని బీఓఎస్ ఛైర్మన్‌గా నియమించారు. ఈయన ఇప్పటి వరకు 11 పుస్తకాలు, 80 పరిశోధనా పత్రాలు రచించారు. 75కు పైగా జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆకాశవాణి హైదరాబాద్, విశాఖపట్నం, కడప కేంద్రాల ద్వారా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈయన రాసిన గేయం పాఠ్యాంశంగా ఉంది. బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా నియమితులైన ఈశ్వర్ రెడ్డిని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఎస్. రఘునాథరెడ్డి, తెలుగు శాఖ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	535	73,158
నిఫ్టీ ▲	162	22,217

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,960	▲ 379
డోజోన్స్	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▲ 22
డాక్స్	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,155	▼ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906	▼ 103
వెండి (కిలో)	70,396	▼ 312

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.62	106.16
€	యూరో	ఒకటి	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.41	64.01
SAR	సౌదీ రియాల్	ఖాయనిటిక	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయనిటిక	21.96	23.49
¥	చైనా యువాన్	ఖాయనిటిక	10.42	12.49

మారుత్ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్

డ్రోన్ల సాయంతో వరిసాగు

హైదరాబాద్: మారుత్ డ్రోన్స్ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేథో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్



జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్ఏయూ) సహకారంతో మారుత్ డ్రోన్స్ అభివృద్ధి చేసిన డైరెక్ట్ సీడింగ్ డ్రోన్‌కు ఈ పేటెంట్ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్ సీడింగ్ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు.

మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్



న్యూఢిల్లీ: కొత్త వెంచర్ అయిన డెకరేటివ్ పెయింట్స్ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్ బ్రాండ్ కింద డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్ (హరియాణ), లూధియానా (పంజాబ్), చెయ్యార్ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ గతేడాది డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్ బిజినెస్ హెడ్ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్ పెయింట్స్ మార్కెట్ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, నెరోలాక్, అక్జో నోవెల్ (డ్యూలక్స్) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడా ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్, పబ్లిక్ ఆఫర్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, క్విప్ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్ఈకి వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్ డెకరేటివ్ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్ ర్యాలీ

- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు



ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు గురువారం కనిష్ట స్థాయిల నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యాయి. యూరో జోన్ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్సే్ఛంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో రాణా షుగర్స్, మవాన షుగర్స్, శ్రీ రేణుక షుగర్స్, దాల్మియా షుగర్స్, భరత్ షుగర్ అండ్ ఇండస్ట్రీస్, ఈఐడీ ప్యారీ షుగర్స్ షేర్లు 3% – 1% చొప్పున నష్టపోయాయి.

డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్ జియో ముందుంది. 2023 డిసెంబర్ నెలకు గాను 39.94 లక్షల మొబైల్ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య నవంబర్ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్ 82,317 మంది, వొడాఫోన్ ఐడియా 9,656, క్వాంటమ్ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

సి.ఎం.ఆర్. ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్



హైదరాబాద్: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్ ఠాకూర్ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్ వేర్ కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్ ఠాకూర్ మా సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు

అశోక్ లేలాండ్ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్ గురువారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	534–00
వరంగల్	536–00
రిటైల్ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్

ఐపీఎల్ నుంచి షమీ అవుట్



భారత పేస్ బౌలర్ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్–2024 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్

రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్ చాంపియన్ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ మొదటి పోరు

- తొలి దశ షెడ్యూల్ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తమ సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు గరిష్టంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ రెండు



బెంగళూరు కెప్టెన్ డు ప్లెసిస్, చెన్నై కెప్టెన్ ధోని (ఫైల్)

'హోమ్' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్ ఫైనల్ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్, క్వాలిఫయింగ్–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా తమ హోమ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్ మ్యాచ్‌లు ఆడుతుంది.

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ X లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ X ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై X రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ X బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో X గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



స్టోక్స్



రోహిత్

రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్, మూడో టెస్టులో జడేజా స్పిన్ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్ వికెట్ కాబట్టి ముగ్గురు రెగ్యులర్ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.

సమం కోసం ఇంగ్లండ్ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్, రూట్, డకెట్, క్రాలీ, పోప్, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు కళ్లెం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్, ఒలీ పోప్, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, శుబ్‌మన్ గిల్, పటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, సిరాజ్, కుల్దీప్, ముకేశ్/ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, హర్మన్‌ప్రీత్

మహిళల లీగ్‌కు వేళాయెె...

నేటి నుంచి డబ్ల్యూపీఎల్	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

తాజా సీజన్ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.